

జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





గురువారం, మార్చి 12, 2026 | పేజీలు: 10


### రోగులకు మెరుగైన వైద్య

# సేవలందించాలి

### జిల్లా కలెక్టర్ భాషా షేక్



గద్వాల మార్చి 11(ప్రజా జ్యోతి ప్రతినిధి):ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యులు,సిబ్బంది ప్రతి రోజు సమయానికి ఆసుపత్రికి హాజరవుతూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వైద్య శాఖ అధికారులను ఆదేశించారు.

బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో జిల్లా కలెక్టర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలోని అన్ని వార్డులను పరిశీలిస్తూ రోగులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితి,వారికి అందుతున్న వైద్య సేవలు,మందులు,ల్యాబ్ రిపోర్టులు,సర్జరీలు వంటివి వివరంగా తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ వైద్య సిబ్బందితో మాట్లాడుతూ,ఆసుపత్రిలో వైద్యులతో పాటు నర్సింగ్ సిబ్బంది,సెక్యూరిటీ, శానిటేషన్ సూపర్వైజర్లు,ఇతర సిబ్బంది వంద శాతం హాజరు ఉండాలన్నారు.ప్రతి


### విద్యాసంస్థ పరువు తీసేలా వ్యవహరిస్తే

# ఉపేక్షించం

### గురుకులఉపాధ్యాయులు బాధ్యతగా విధులు నిర్వహించాలి

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్





# మార్చిలోనే భగభగ

### మండుతున్న ఎండలు...
### అప్రమత్తంగా ఉండాల్సిన సమయం

**మహబూబ్‌నగర్, మార్చి, 11 (ప్రజా జ్యోతి)**

వేసవికాలం ప్రారంభమవడంతో జిల్లాలో ఎండల తీవ్రత రోజురోజుకు పెరుగుతోంది. ఉదయం నుంచే ఎండ కాస్త ఎక్కువగా ఉండగా, మధ్యాహ్నం సమయానికి ఉష్ణోగ్రతలు అధికంగా నమోదవుతూ ప్రజలను తీవ్రంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్నం 12 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండడంతో ప్రజలు అత్యవసర పనులు తప్ప బయటకు రావడానికి ఆసక్తి చూపడం లేదు.పట్టణాలు, గ్రామాల్లో మధ్యాహ్నం వేళల్లో రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. సాధారణంగా రద్దీగా ఉండే బజార్లు, వీధులు కూడా ఎండ కారణంగా నిశ్శబ్దంగా కనిపిస్తున్నాయి. ఉద్యోగులు, వ్యాపారులు కూడా తమ పనులను ఉదయం లేదా సాయంత్రం సమయాల్లో పూర్తి చేసుకునే ప్రయత్నం చేస్తున్నారు.వేసవి ప్రభావం చిన్నపిల్లలు, వృద్ధులపై ఎక్కువగా పడే అవకాశముందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



### సమాజం నుంచి మాదకద్రవ్యాలను

# తరిమికొట్టాలి

### - ప్రహరీ క్లబ్ జిల్లా స్థాయి శిక్షణలో అధికారుల పిలుపు




మహబూబ్‌నగర్, మార్చి 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) సమాజం నుంచి మాదకద్రవ్యాలను తరిమికొట్టేందుకు ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ ప్రభుత్వ పాఠశాలలో జిల్లా స్థాయి ప్రహరీ క్లబ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సమాజంలో మాదకద్రవ్యాల ప్రభావాన్ని తగ్గించాలంటే

## రోగులకు మెరుగైన వైద్య

# సేవలందించాలి

రోజు హాజరు వివరాలు తప్పనిసరిగా బయోమెట్రిక్ వ్యవస్థ ద్వారా నమోదు చేయాలని ఆదేశించారు.బయోమెట్రిక్ లో ఏమైనా టెక్నికల్ సమస్యలు ఉంటే రెండు రోజుల్లో పరిష్కరించాలన్నారు.ఆసుపత్రిలో ఔట్సోర్సింగ్ ఉద్యోగులుగా పనిచేస్తున్న వారు కూడా తమ హాజరును బయోమెట్రిక్ ద్వారా నమోదు చేయాలన్నారు.కొన్ని వార్డులలో ఫ్యాన్లు పనిచేయడం లేదని గమనించి,వాటిని వెంటనే సరి చేయించి అన్ని ఫ్యాన్లు పని చేసేలా మరమ్మత్తులు చేయాలన్నారు.ఆసుపత్రిలో ఎక్కడా పేషెంట్లు నిలబడకుండ,వారికి సౌకర్యంగా,వేగంగా వైద్య సేవలు అందేలా టోకెన్ సిస్టమ్ అమలు చేయాలన్నారు. ఆసుపత్రి టాయిలెట్లు ప్రతి రెండు గంటలకు ఒకసారి శుభ్రం చేసి చార్ట్ లో రాయాలని, ఆసుపత్రి పరిసరాలు శుభ్రంగా,పిచ్చి మొక్కలు లేకుండా ఉంచాలని శానిటేషన్ అధికారులకు ఆదేశించారు.వేసవి నేపథ్యం లో రోగులకు త్రాగునీరు సమస్య లేకుండా చూసుకోవాలన్నారు.ఆసుపత్రిలో పలుచోట్ల ఫ్లోర్, పై కప్పు సంబంధించి ఉన్న లోపాలను సరిచేసేందుకు టీజీఎంఐడీసీ సిబ్బంది రిపేర్ల వివరాలతో నివేదిక అందించి,తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఆసుపత్రిలో భోజనం అందిస్తున్న సిబ్బందితో మాట్లాడి పౌష్టికాహారం అందించాలన్నారు.ల్యాబ్,రేడియాలజీ, డయాగ్నోస్టిక్ సెంటర్స్‌ను పరిశీలించి,ల్యాబ్ రిపోర్టులు,ఎమర్జెన్సీ టెస్టులు త్వరగా పూర్తి చేసి రోగులకు అందజేయాలని అన్నారు.ఈ సందర్భంగా పలువురు రోగులు తమ సమస్యలను జిల్లా కలెక్టర్ కు విన్నవించుకోగా,కలెక్టర్ వెంటనే స్పందించి రోగులకు ఉన్న ఇబ్బందులను పరిష్కరించి వారికి మెరుగైన వైద్యం అందించేందుకు తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్ఎంఓ హేమలత,డాక్టర్లు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# విద్యాసంస్థ పరువు తీసేలా వ్యవహరిస్తే ఉపేక్షించం

కల్వకుర్తి, మార్చ్ 11 (ప్రజా జ్యోతి):

వెల్దండ మండల కేంద్రంలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ, గిరిజన బాలికల గురుకుల పాఠశాలలను జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.సాంఘిక గురుకుల పాఠశాలలో బాలికలతో కలిసి సహపంక్తి మధ్యాహ్న భోజనం చేశారు.తప్పనిసరిగా ప్రభుత్వం అందించిన కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని వండిన ఆహారపదార్థాలు ప్రతి ఒక్కరికి కడుపునిండా పెట్టాలని సిబ్బందిని ఆదేశించారు.స్టోర్ లో సరుకులు చెక్ చేశారు. నాణ్యమైన ఆహార పదార్థాలను మాత్రమే వాడాలని సూచించారు. విద్యార్థులతోఆప్యాయంగాపలకరించి ఆహారం ఎలా ఉంది, రుచిగాఉందా అని అడిగి తెలుసుకున్నారు.ఈ తనిఖీ సందర్భంగా పాఠశాలలో బోధన విధానం, విద్యార్థుల సౌకర్యాలు, భౌతిక వసతులు, క్రమశిక్షణ మరియు నిర్వహణ పరిస్థితులను వివరంగా పరిశీలించారు.అంతకుముందు జిల్లా కలెక్టర్ ఉపాధ్యాయులతో మాట్లాడుతూ.గురుకులాల ఉపాధ్యాయులు తమ బాధ్యతలను నిబద్ధతగా నిర్వర్తించి, విద్యార్థుల విద్యా అభ్యున్నతికి మాత్రమే కృషి చేయాలని,విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఎవరికి ఇబ్బందులుకలిగించకూడదని, సంస్థ, పాఠశాల పరువు తీసేలా లేదా ప్రతిష్ఠకు భంగం కలిగించే విధంగా ఎవరూ వ్యవహరించరాదు అని కలెక్టర్ హెచ్చరించారు.గురుకులాల్లో ఏమైనా సమస్యలు ఉంటే, వాటిని తక్షణమే ఉన్నతాధికారులు, లేదా తన దృష్టికి తీసుకురావాలని, సంబంధిత అధికారులు వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తారని తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థుల విద్య, వ్యక్తిత్వ, నైతిక అభివృద్ధికి మరింత కృషి చేయాలని, గురుకులాల్లో క్రమశిక్షణ, నాణ్యతా ప్రమాణాలను పాటించాలని కలెక్టర్ ప్రత్యేకంగా ఉపాధ్యాయులకు హితవు పలికారు.

ఉపాధ్యాయుల అంతర్గత విభేదాల కారణంగా విద్యాసంస్థల పరువు తీయకూడదు అని కలెక్టర్ తీవ్రంగా హెచ్చరించారు. విద్యార్థులకు ఇబ్బందులు ఎదురయ్యే విషయాలను ఎవ్వరూ కల్పించిన ఉపేక్షించబడును కలెక్టర్ స్పష్టం చేశారు.ఇటీవల కేజీబీవీ లో జరిగిన ఘటనలపై కొంతమందిని ఉద్యోగం నుండి శాశ్వతంగా టర్మినేషన్ చేయడం జరిగిందని స్పష్టం చేశారు.

సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి తప్ప రోడ్డుపైకి విద్యార్థులను పంపడమేమిటని కలెక్టర్ ఉపాధ్యాయులను ప్రశ్నించారు.

సమస్యలు ఉంటే బయట పరిష్కరించుకోండి పాఠశాలలో సమస్యలు సృష్టించి విద్యార్థులకు ఆటంకం కలిగించొద్దని కలెక్టర్ ఆదేశించారు.

ఇకపై ఇలాంటి విషయాలపై సహించబోమని కలెక్టర్ తెలిపారు.

విద్యార్థులకు పరీక్షలు కొనసాగుతున్నందున వారి విద్యాభ్యాసం పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంటే కల్వకుర్తి ఆర్డీవో జనార్దన్ రెడ్డి, వెల్దండ తహసిల్దార్ కార్తీక్ కుమార్, వెల్దండ ఎంపీడీవో కృష్ణయ్య తదితరులు ఉన్నారు

# మార్చి 12న ,ఏఐపీకేఎంఎస్ జిల్లా రెండవ మహాసభల ను విజయవంతం చేయండి

## ఏఐకెపిఎంఎస్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 11 (ప్రజా జ్యోతి)

అఖిలభారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా రెండవ మహాసభలు నారాయణపేట భగత్ సింగ్ భవన్ లో జరగనున్నాయని ఏఐపీకేఎంఎస్ జిల్లా కార్యదర్శి ప్రశాంత్ తెలిపారు. ఈ సభలకు ముఖ్య వక్తలుగా ఆ రాష్ట్ర అధ్యక్షులు ఎం. కృష్ణ, రాష్ట్ర నాయకులు ప్రసాద్, పాల్గొంటారని,సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి రాము, గారు సభలను ప్రారంభిస్తారని, జిల్లా అధ్యక్షులు సలీమ్ మరియు, రైతు కార్మిక ప్రజాసంఘాల నాయకులు హాజరు కానున్నారు.ఈ సభలకు జిల్లాలోని 13 మండలాల నుంచి ప్రతినిధులు హాజరవుతారని, తెలిపారు. దేశంలో రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తేవాలని కనీస వేతనాలు ఎనిమిది వందల రూపాయలు రోజుకు చెల్లించాలని డిమాండ్ చేశారు రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా కింద సంవత్సరానికి 12,000 రూపాయలు ఇస్తామని హామీ ఇచ్చి నేటికీ పూర్తిస్థాయిలో అమలు జరగటం లేదన్నారు. ఒకే విడతలు 6000 మాత్రమే చెల్లించడం ఎంతవరకు సమంజసం అన్నారు. రెండేళ్లు గడుస్తున్న పథకం అమలుకు నోచకపోవడం లేదన్నారు. అర్హులైన వారికి ఇల్లు పెన్షన్లు రేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. దళితులకు మూడెకరాల భూమిని ఇస్తామన్న ప్రజలకు హామీ ఇస్తే హామీ నెరవేర్చనందున వారు అధికారాన్ని కోల్పోయారన్నారు, ప్రభుత్వం భూమిలేని వ్యవసాయ కూలీల కు మిగులు భూములు, ప్రభుత్వములు పంచాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులను సమీకరించి బలమైన ఉద్యమాలు నిర్వహిస్తామని అందుకు భవిష్యత్ కార్యక్రమాలు రూపొందించుకొనుటకై మహాసభలు జరుపుతున్నామని తెలిపారు. వ్యవసాయ కూలీల సమస్యలు రైతాంగంతో కాకుండా ప్రభుత్వం పరిష్కరించవలసి ఉన్నది. అన్నారు. ఐక్య,పోరాటాలు నిర్వహిస్తామని చెప్పారు . జిల్లా ఉపాధ్యక్షుడు జి వెంకట్ రాములు ,హాజీ మలంగ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు.




## సమాజం నుంచి మాదకద్రవ్యాలను

# తరిమికొట్టాలి

పాఠశాల స్థాయి నుంచే విద్యార్థుల్లో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థులు డ్రగ్స్‌కు అలవాటు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆనందదాయకమైన జీవితానికి ఆటలు, సంగీతం, మంచి ఆరోగ్యం, క్రమశిక్షణతో చదువుకోవడం వంటి మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. శత్రుదేశాలు భారతదేశాన్ని బలహీనపరచేందుకు డ్రగ్స్ మహమ్మారిని వ్యాప్తి చేస్తున్నాయని, దీనిని నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ నరసింహారెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్యాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తమ పరిసరాల్లో ఎవరైనా డ్రగ్స్‌కు బానిసలవుతున్నట్లు గమనిస్తే వెంటనే యాంటీ డ్రగ్స్ టోల్ ఫ్రీ నంబర్ 1908కు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అకాడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా స్థాయిలో ఇచ్చిన శిక్షణలో నేర్చుకున్న అంశాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. కమ్యూనిటీ మొబిలైజర్ అధికారి సుధాకర్ రెడ్డి ప్రతి పాఠశాలలో ప్రహరీ క్లబ్ కమిటీలను ఏర్పాటు చేసి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు.

ఈ సందర్భంగా డ్రగ్స్‌పై అవగాహన కల్పించే పోస్టర్ మేకింగ్ కార్యక్రమాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి అభినందించారు. కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్లు కే. సుమన్ మహారాజ్, వి. శశిరేఖ, పి. ఈశ్వరమ్మ, అబ్దుల్ బాసిద్, సి.ఆర్.పి మొగులయ్య, నరేష్ తదితరులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

# మార్చిలోనే భగభగ



అధిక ఎండ కారణంగా దాహం, అలసట, తలనొప్పి, నీరసం వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఎండలో ఎక్కువసేపు తిరిగితే హీట్ స్ట్రోక్ వచ్చే ప్రమాదం కూడా ఉందని తెలిపారు. అందువల్ల ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

బయటకు వెళ్లే సమయంలో తలకు గుడ్డ లేదా టోపీ ధరించడం, గొడుగు వాడడం, తరచుగా నీరు తాగడం వంటి అలవాట్లు పాటించాలి. అలాగే చల్లని పానీయాలు, మజ్జిగ, కొబ్బరి నీరు, పండ్లరసాలు తీసుకోవడం వల్ల శరీరానికి తగినంత ద్రవాలు అందుతాయని వైద్యులు సూచిస్తున్నారు.

వేసవికాలంలో రైతులు కూడా తమ పనులను ఉదయం మరియు సాయంత్రం వేళల్లో చేసుకునేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు. మధ్యాహ్నం వేళల్లో పొలాల్లో పనిచేయడం కష్టంగా మారడంతో రైతులు ఎండ తగ్గిన తర్వాతే పనులు చేపడుతున్నారు. మరోవైపు పశువులకు తగినంత నీరు అందించేలా రైతులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

ఎండ తీవ్రత కారణంగా చెరువులు, బావులు, కుంటల్లో నీటి మట్టం క్రమంగా తగ్గుతున్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈనెల ఆఖరి వరకు పొలాలకు కూడా నీళ్లు అందకపోవచ్చు అని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి పూర్తిగా ప్రారంభమైతే తాగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అందువల్ల నీటి వనరులను సంరక్షించడం, నీటిని వృథా చేయకుండా ఉపయోగించడం చాలా అవసరమని అధికారులు సూచిస్తున్నారు.

ఇకపోతే వేసవికాలంలో పలు ప్రాంతాల్లో ఐస్‌క్రీమ్‌లు, చల్లని పానీయాలు, పండ్ల రసాలకు డిమాండ్ పెరుగుతోంది. ముఖ్యంగా పుచ్చకాయ, ఖర్బూజ వంటి పండ్లు ఎక్కువగా విక్రయాలు అవుతున్నాయి. వీటితో పాటు మజ్జిగ, నిమ్మరసం వంటి పానీయాలు కూడా ప్రజలు ఎక్కువగా తీసుకుంటున్నారు.

వేసవికాలం మరింత తీవ్రంగా మారే అవకాశముండడంతో ప్రజలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని వైద్యులు సూచిస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, వృద్ధులు ఎండలో ఎక్కువసేపు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంటున్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండి అవసరమైన జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఉందని అధికారులు తెలిపారు.

## ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి





### -ఎమ్మెల్యే డా.కూచుకుళ్ల రాజేష్ రెడ్డి

**నాగర్ కర్నూల్ : 11 మార్చ్ (ప్రజా జ్యోతి)**

నాగర్ కర్నూల్ పట్టణంలో ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని సమర్ధవంతంగా అమలు చేసి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు పూర్తి స్థాయిలో వివరించాలని ఎమ్మెల్యే కూచుకుళ్లరాజేష్ రెడ్డి అధికారులను ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన అనంతరం ప్రభుత్వం మూడోసారి ప్రజల్లోకి వెల్లి ప్రజా సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకొని పరిష్కరించేందుకు గ్రామ సభలు నిర్వహించేందుకు సిద్ధమవుతోందన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమం యొక్కముఖ్య లక్ష్యమని ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక పేరిట చేపడుతున్న 99 రోజుల కార్యచరణ ప్రణాళికకు ప్రత్యేక లోగోను రూపొందించారని,ఈకార్యక్రమం ద్వారా ప్రజలకు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించడమే కాకుండా సమస్యలను తెలుసుకుని పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.పట్టణంలోని 8వ,వార్డులో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించి
ప్రజలు ఆరోగ్యంగా ఉండేందుకు శుభ్రత ఎంతో ముఖ్యమని ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో
మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర కుమార్,వైస్ చైర్మన్ బాదం రమేష్,కౌన్సిలర్లు,మున్సిపల్ అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## ఇతోల్ పాఠశాలలో భోజనశాలను ప్రారంభించిన డాక్టర్.రాధికా లక్ష్మారెడ్డి



**నాగర్ కర్నూల్ : 11 మార్చ్**

తాడూరు మండల పరిధిలోని ఐతోల్ గ్రామంలోని
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల అవసరనిమిత్తం నాగర్ కర్నూల్ రాఘవేంద్రహాస్పిటల్ ఫౌండర్ డాక్టర్. రాధిక లక్ష్మా రెడ్డితన తండ్రి సత్తవరం శ్రీనివాస్ రెడ్డి జ్ఞాపకార్థంనిర్మించిన భోజనశాలను,సమావేశ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు.కార్యక్రమంలో సర్పంచ్సంధ్య,ఉపసర్పంచ్ లక్ష్మీ,పూజారి హరికృష్ణ,గ్రామ పెద్దలు నర్సింహా మ్రెడ్డి,లక్ష్మయ్య,రాంరెడ్డి,అఖిల్,తిరుపతిరెడ్డి,రాంకిషన్,శివాజీపాల్గొన్నారు.

### ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికపై ప్రజా ప్రతినిధులకు శిక్షణ

గద్వాల మార్చి 11(ప్రజా జ్యోతి ప్రతినిధి):జోగులాంబ గద్వాల జిల్లాలో ప్రజాపాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా నూతనంగా ఎన్నికైన సర్పంచులు,మున్సిపల్ కౌన్సిలర్లకు ఈనెల 12వ,తేదీ గురువారం ఒకరోజు ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ తెలిపారు.గద్వాలలోని బీరెల్లి రహదారిలో ఉన్న బృందావన్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఉదయం 9:30 గంటల నుండి సాయంత్రం 5:00 గంటల వరకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడుతుందని పేర్కొన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు,అభివృద్ధి కార్యక్రమాలు,ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా 99 రోజుల కార్యక్రమాలపై జిల్లా అధికారులు,నిపుణులచే ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించబడుతుందని తెలిపారు.జిల్లాలోని 255 గ్రామ పంచాయతీల సర్పంచులు,4 మున్సిపాలిటీల కౌన్సిలర్లు ఈ శిక్షణ కార్యక్రమానికి హాజరై సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.



## వేసవిలో కూరగాయల సాగు అద్భుతం శాసన పల్లి గ్రామం

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 11( ప్రజా జ్యోతి)**

నారాయణపేట జిల్లా శాసన పల్లి గ్రామంలో కూరగాయల సాగు అద్భుతంగా జరుగుతుంది గ్రామంలో అందరు రైతులు నారాయణపేట పట్టణం సమీపంగా ఉన్నందున కూరగాయల సాగు అధికంగా శాసన్ పల్లి గ్రామంలో విస్తరించడం భాగంగా ప్రతి రైతు బోరు బావులున్న రైతులు టమాటా వంకాయ మిరపకాయ ఆకుకూరలు బీరా బెండ సాగుకు ప్రాధాన్యత నిచ్చి ప్రతిరోజు కూరగాయల మార్కెట్ కు కాజా కూరగాయలు అందిస్తున్న సందర్భంగా ఈరోజు మండల వ్యవసాయ అధికారి దివాకర్ గారు శాసనపల్లి గ్రామం సందర్శించడం జరిగింది ప్రతి పొలంలో కూరగాయలను చూసి వంకాయ తోటలో సస్యరక్షణ భాగంగా పురుగులు రాకుండా ముందు దృష్టి పెట్టి మందులు పిచికారి చేయాలి తోటను ఆరోగ్యంగా కాపాడాలి ఈ తోట సంవత్సరం వరకు పంట పండుతుంది చోటనే రక్షించుకుంటే మంచి లాభంగా ఆర్థికంగా బాగుంటుందని చెప్పి మందులు రాయడం జరిగింది కూరగాయల సాగుకు శాసనపల్లి భూములు చాలా అనుకూలంగా ఉన్నవి వేసవికాలంలో మంచి దిగుబడినిచ్చే రకాలు మొక్కలు ఎన్నుకొని నాటుకోవాలి అధిక దిగుబడి నిచ్చే పంటలు పండించి ఆర్థికంగా బాగుండాలని కోరుతున్నాం ప్రతి కుటుంబానికి రోజు ఆర్థికంగా లాభం రావాలంటే కూరగాయల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి మండల భారతీయ కిసాన్ సంగం అధ్యక్షులు గంప శ్రీనివాస్ తెలపడం జరిగింది ఈరోజు కోటకొండ లింగప్ప కూరగాయల పొలము సందర్శించడం జరిగింది జాజాపురం రైతు సంఘం నాయకుడు లక్ష్మీకాంత్ ఇట్టి విషయాన్ని తెలపడం జరిగినది




## భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లు -- భక్తుల కోసం ప్రత్యేక యాత్ర ప్యాకేజీలు

### - ఏప్రిల్ 28 నుంచి జూన్ 12 వరకు హైదరాబాద్ నుంచి నాలుగు ప్రత్యేక రైలు యాత్రలు

**మహబూబ్‌నగర్, మార్చి 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) :**

తీర్థయాత్రలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం రైల్వే శాఖ ప్రత్యేక "భారత్ గౌరవ్ టూరిస్ట్ రైళ్లు" అందుబాటులోకి తీసుకొచ్చినట్లు ఐఆర్సిటిసి టూరిజం అసిస్టెంట్ మేనేజర్ పి.వి. వెంకటేష్ తెలిపారు. తెలుగు రాష్ట్రాల భక్తుల కోసం ఏప్రిల్ 28 నుంచి జూన్ 12 వరకు హైదరాబాద్ నుంచి నాలుగు ప్రత్యేక యాత్ర ప్యాకేజీలను నిర్వహించనున్నట్లు వెల్లడించారు. యాత్రలో రైలు ప్రయాణం, బస్సు సదుపాయం, హోటల్ వసతి, భోజనాలు, టూర్ ఎస్కార్ట్, ప్రయాణ బీమా వంటి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు.

యాత్ర ప్యాకేజీలు

1. అయోధ్య -- కాశీ -- బైద్యనాథ్ ధామ్ దర్శన్ యాత్ర (ఎస్ సి జెడ్ బి సి 56) పూరి, కోణార్క్, బైద్యనాథ్ ధామ్, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ ప్రాంతాలను సందర్శించే ఈ యాత్ర ఏప్రిల్ 28న ప్రారంభమై మే 7 వరకు కొనసాగుతుంది. సాధారణ టికెట్ రూ.16,700, 3 ఏసీ రూ.26,100, 2 ఏసీ రూ.34,100. సికింద్రాబాద్ నుంచి ప్రారంభమై కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం మీదుగా ప్రయాణిస్తుంది.

2. హరిద్వార్ -- మాతా వైష్ణోదేవి -- రిషికేశ్ యాత్ర (ఎస్ సి జెడ్ బి సి57) మధుర, బృందావనం, మాతా వైష్ణోదేవి, హరిద్వార్, రిషికేశ్ ప్రాంతాలను సందర్శించే ఈ యాత్ర మే 12న ప్రారంభమై మే 21 వరకు కొనసాగుతుంది. సాధారణ టికెట్ రూ.16,500, 3 ఏసీ రూ.25,700, 2 ఏసీ రూ.33,400. సికింద్రాబాద్ నుంచి భువనగిరి, జనగాం, కాజీపేట, పెద్దపల్లి, మంచిర్యాల్, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్ నగర్, బల్హార్ష, వార్తా, నాగ్పూర్ మీదుగా వెళ్తుంది.

3. అరుణాచలం -- చిదంబరం దివ్య దక్షిణ యాత్ర (ఎస్ సి జెడ్ బి సి58) తిరువణ్ణామలై (అరుణాచలం), రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రిచ్చి, తంజావూరు, చిదంబరం ప్రాంతాలను సందర్శించే ఈ యాత్ర మే 24న ప్రారంభమై మే 31 వరకు కొనసాగుతుంది. సాధారణ టికెట్ రూ.14,500, 3 ఏసీ రూ.21,700, 2 ఏసీ రూ.27,900. సికింద్రాబాద్ నుంచి జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర, విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు, రేణిగుంట మీదుగా ప్రయాణిస్తుంది.

4. బైద్యనాథ్ ధామ్‌తో అయోధ్య -- కాశీ పుణ్యక్షేత్ర యాత్ర (ఎస్ సి జెడ్ బి సి 59) పూరి, కోణార్క్, బైద్యనాథ్ ధామ్, వారణాసి, అయోధ్య, ప్రయాగరాజ్ ప్రాంతాలను సందర్శించే ఈ యాత్ర జూన్ 3న ప్రారంభమై జూన్ 12 వరకు కొనసాగుతుంది. సాధారణ టికెట్ రూ.16,700, 3 ఏసీ రూ.26,100, 2 ఏసీ రూ.34,100. సికింద్రాబాద్ నుంచి కాజీపేట, వరంగల్, ఖమ్మం, విజయవాడ, గుడివాడ, భీమవరం, తణుకు, నిడదవోలు, రాజమండ్రి, సామర్లకోట, తుని, దువ్వాడ, పెందుర్తి, విజయనగరం మీదుగా వెళ్తుంది.

యాత్ర సౌకర్యాలు :
యాత్రలో రైలు, బస్సు ప్రయాణం, హోటల్ వసతి, ఉదయం అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం, వాటర్ బాటిల్స్, టూర్ ఎస్కార్ట్ సేవలు, ప్రయాణ బీమా వంటి సౌకర్యాలు ఉంటాయి. ప్రతి కోచ్‌కు సెక్యూరిటీ గార్డ్ ఏర్పాటు చేయడంతో పాటు రైలులో సీసీ కెమెరాలతో భద్రత కల్పించనున్నట్లు తెలిపారు.

**దేశీయ విమాన ప్యాకేజీలు:**
వేసవి ప్రత్యేకంగా హైదరాబాద్ నుంచి కాశ్మీర్, కాశీ--అయోధ్య, గుజరాత్, కర్ణాటక, హరిద్వార్--రిషికేశ్, చార్ ధామ్, లడఖ్, అండమాన్ ప్రాంతాలకు 5 నుంచి 11 రోజుల విమాన ప్యాకేజీలు అందుబాటులో ఉన్నాయి. వీటి ధరలు రూ.34,900 నుంచి రూ.74,430 వరకు ఉంటాయి.
అంతర్జాతీయ విమాన ప్యాకేజీలు :
నేపాల్, థాయిలాండ్, శ్రీలంక, యూరోప్ ప్రాంతాలకు ప్రత్యేక అంతర్జాతీయ టూర్ ప్యాకేజీలు కూడా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. వీటి ధరలు రూ.53,800 నుంచి రూ.4,41,650 వరకు ఉంటాయి. భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలు మరియు దేశీయ విమాన ప్యాకేజీలపై ఎల్టీసీ వర్తిస్తుందని తెలిపారు. టికెట్లు బుక్ చేసుకోవాలనుకునే వారు 9701360701, 9281030733, 9281030734, 9281030744, 9281030759 నంబర్లను సంప్రదించాలని సూచించారు. మరిన్ని వివరాలకు www.irctctourism.com వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపారు.



## నేడు గాంధీభవన్‌లో టీపీసీసీ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా ఖమ్మంపల్లి సత్యనారాయణ ప్రమాణ స్వీకారం

### - బడ్జెట్‌లో దళితులకు ప్రాధాన్యం కల్పించాలని కాంగ్రెస్ ఎస్సీ సెల్ డిమాండ్



మహబూబ్‌నగర్, మార్చి 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) తెలంగాణ రాష్ట్ర టీపీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు ప్రశాంత్ జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్‌కు నూతనంగా ఎన్నికైన మనకొండూరు ఎమ్మెల్యే ఖమ్మంపల్లి సత్యనారాయణను టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించిన నేపథ్యంలో ఆయన ప్రమాణ స్వీకార కార్యక్రమం మార్చి 12న మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల స్థాయి నుంచి ప్రత్యేక మండలాధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని కోరారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మారుగల సాయిబాబా మాట్లాడుతూ రాబోయే తెలంగాణ రాష్ట్ర బడ్జెట్‌లో దళితులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించి వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రత్యేక పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీ సంక్షేమ హాస్టల్లు, గురుకుల పాఠశాలల్లో నాణ్యమైన పౌష్టికాహారం అందించడంతో పాటు మౌలిక సదుపాయాల కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని కోరారు.అదేవిధంగా రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎస్సీ స్టడీ సర్కిల్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. అలాగే సర్పంచ్, కౌన్సిలర్, కార్పొరేటర్ ఎన్నికల్లో ఎస్సీలకు రిజర్వ్ అయిన గ్రామాలు, వార్డుల్లో ప్రత్యేక బడ్జెట్ కేటాయించి మౌలిక వసతులు కల్పించాలని కోరారు. జనరల్ స్థానాల్లో ఎస్సీలుగా ఎన్నికైన ప్రజాప్రతినిధుల ప్రాంతాల్లో కూడా ప్రత్యేక బడ్జెట్ కేటాయించి అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులను చట్టబద్ధంగా అమలు చేస్తూ ప్రతి నియోజకవర్గానికి రూ.200 కోట్ల చొప్పున కేటాయించి మొత్తం రూ.25 వేల కోట్ల బడ్జెట్‌ను ఈ బడ్జెట్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నరేందర్, రాములు, పీర్ మొహమ్మద్ సాదిక్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎక్కడ ఉన్నా రాజే ప్రజలే తన ఊపిరి... యువత తన కవచకుండాలు రాజు రాజే...

### గోవుల కార్తీకును పరామర్శించి... కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించిన.... 11వ వార్డు కౌన్సిలర్ గుండ్రాతి స్వప్న శిల్ప కిరణ్ తేజ గౌడ్....

**కొల్లాపూర్ మార్చి 11 ప్రజా జ్యోతి**



గోవుల కార్తీక్ గారిని మల్లారెడ్డి ఆసుపత్రిలో పరామర్శించిన కౌన్సిలర్ గుండ్రాతి స్వప్న శిల్ప కిరణ్ తేజ గౌడ్.కొల్లాపూర్ మున్సిపాలిటీ 11 వ వార్డు కి చెందిన గోవుల కార్తీక్ ఉ అస్లాం నిన్న కొల్లాపూర్ పట్టణంలో బాత్ రూమ్ మరమ్మత్తు నిర్మాణ పనికి వెళ్ళాడు పని చేస్తుండగా బాత్ రూమ్ పై కప్పు కూలి ఇద్దరు తీవ్ర ప్రమాదానికి గురిఅయ్యారు, అందులో గోవుల కార్తీక్ పరిస్థితి విషమంగా ఉండటంతో నిన్న రాత్రి మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్లో ఉన్న మల్లారెడ్డి హాస్పిటల్ కు తరలించారు..ప్రస్తుతం వెంటిలేషన్ మీద చికిత్స పొందుతున్న గోవుల కార్తీ క్ ను పరామర్శించడానికి బుధవారం రోజు స్థానిక కొల్లాపూర్ మున్సిపాలిటీ 11వ వార్డు కౌన్సిలర్ గుండ్రాతి స్వప్న శిల్ప కిరణ్ తేజ గౌడ్, చికిత్స పొందుతున్న గోవుల కార్తీక్ని పరామర్శించారు. పేషెంట్ పరిస్థితి ఎలా ఉన్నది అని డాక్టర్ వేణుగోపాల్ తో అడిగి తెలుసుకుంటున్న కౌన్సిలర్ స్వప్న శిల్ప కిరణ్ తేజ గౌడ్, పేషెంట్ కు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలని డాక్టర్లు కోరారు అదేవిధంగా గోవులకార్తీక్ కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పి 20000/- రూపాయలు ఆర్థిక సహాయంను పేషెంట్ కుటుంబ ఖర్చులకు అందించారు, అనంతరం పదవి ఉన్నా లేకపోయినా సైన్యం ఉన్నా లేకపోయినా ఎక్కడ ఉన్నా ఈయన రాజు లాగానే ప్రజలను కాపాడుకునే గుణం ఉన్న నాయకుడు గుండ్రాతి స్వప్న శిల్ప కిరణ్ తేజ గౌడ్. కొల్లాపూర్ నియోజక వర్గంలో ఉన్న పల్లెల్లో ఏ కార్యం జరిగినా పసుపు కుంకుమలతో పాటు పట్టు చీరలతో హాజరై దీవిస్తారు.అదేవిధంగా గ్రామాలలో యువతకు ఆటపాటలకు యువతను ప్రోత్సహిస్తూ ఉన్నత శిఖరాలకు ఎదగాలని తనవంతుగా సహాయం చేస్తూ ఆశీర్వదిస్తాడు, ఈయన ఎక్కడ ఉన్న మనసున్న మహారాజే. అనంతరం గోవుల కార్తీక్ ఆరోగ్యము త్వరగా కోలుకోవాలనీ భగవంతుని వేడుకున్న గుండ్రాతి స్వప్న శిల్ప కిరణ్ తేజ గౌడ్.

## ఈనెల 14 నుంచి 10వ తరగతి పరీక్షలు

**కొల్లాపూర్ మార్చి 11 ప్రజా జ్యోతి**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తం గా మార్చి 14 నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి పరీక్షలు ఏప్రిల్ 16వ తేదీ వరకు కొనసాగనున్నాయి విద్యార్థులు ముమ్మరంగా ప్రిపరేషన్ సాగిస్తున్నారు. మరోవైపు ఇప్పటికే విద్యార్థుల హాల్ టికెట్లు కూడా విడుదలయ్యాయి మీ సేవ కేంద్రాల ద్వారా కూడా డౌన్‌లోడ్ చేసుకునే వెసులుబాటు కల్పించారు. 8096958096 వాట్సాప్ నంబరు ద్వారా కూడా హాల్‌టికెట్లు పొందొచ్చు.

విద్యార్థులు భయపడ కుండా ఆత్మవిశ్వాసంతో రాయాలని విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా విద్యార్థులకు సూచించా రు.ఈ సారి రాష్ట్ర వ్యాప్తం గా మొత్తంగా 5,28,239 మంది పరీక్షలకు హాజరవు తున్నారు. వీరిలో రెగ్యుల ర్ విద్యార్థులు 5,17,727 మంది ఉన్నారు. 5,329 ప్రభుత్వ పాఠశాలల నుంచి 2,07,573 మంది, 1,057 గురుకులాల నుంచి 60, 139 మంది, 5,288 ప్రైవే ట్, ఎయిడెడ్ పాఠశాలల నుంచి 2,50,015 మంది పరీక్షలు రాయనున్నా సమాచారం రాష్ట్ర విద్యాశాఖ వెల్లడించిన సమాచారం,ఆయా తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు సులువుగా చేరుకునేం దుకు హాల్‌టికెట్లపై క్యూఆర్ కోడ్‌ను కూడా ముద్రించారు,మొబైల్ ఫోన్ ద్వారా దీనిని స్కాన్ చేస్తే రూట్ మ్యాప్ ఆటోమెటిక్‌గా ఓపెన్ అవుతుంది. కొల్లాపూర్ నియోజక వర్గం మండలం పల్లెల్లో ఉన్న విద్యార్థులు విద్యార్థినీలకు రాసే పదో తరగతి పరీక్షలు జీవితంలో ఒకసారి మాత్రమే జరుగుతాయి అందువల్ల విద్యార్థులు పాఠ్యాంశాలు చదివి వాటిని రాయడం ద్వారా ఎక్కువ కాలం గుర్తుంటాయి.అప్పుడు పరీక్షల్లో సమాధానాలు చక్కగా గుర్తుపెట్టుకుని రాయడానికి అవకాశం ఉంటుందని అదేవిధంగా సీసీ కెమెరాలు ముందే పరీక్ష పేపర్ ఓపెన్ చేసిన ఏర్పాట్లు చేశారు అదే విధంగా రాష్ట్ర విద్య శాఖ సమాచారం ఉన్నది.



## మహిళ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో ఎన్.ఎస్.ఎస్ ప్రత్యేక వేసవి శిబిరం

### -యువత విద్యార్థుల ద్వారా గ్రామాలలో స్వచ్ఛ కార్యక్రమం






**గద్వాల (ప్రజా జ్యోతి) మార్చి 11:**

గద్వాల ప్రియదర్శిని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో ఐదవ రోజు వెంకంపేట గ్రామంలో బుధవారం స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు గ్రామంలోని యువతతో కలిసి గద్వాల కేంద్రంలో దేవాలయాలను దర్శించి, ఆలయాల చుట్టుపక్కల ఉన్న చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ.మీనాక్షి మాట్లాడుతూ..పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని విద్యార్థినులకు గ్రామస్థులకు సూచించారు.గ్రామాలలో ప్లాస్టిక్ కవర్స్ మరి ఇతర ఏ వస్తువులైన ఎక్కడపడితే అక్కడ వేయకూడదు అలా వేస్తే రోగాల బారిన పడేది మనమే అని తెలిపారు.

తదుపరి శిబిరంలో ముఖ్య అతిథిగా గద్వాల జిల్లా జనవిజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి పరంజ్యోతి పాల్గొని విజ్ఞాన శాస్త్రంలో మహిళల పాత్ర అనే అంశంపై అవగాహన కల్పించారు.మహిళలు విజ్ఞాన శాస్త్ర రంగంలో ముందుకు రావాలని సమాజ అభివృద్ధిలో వారి పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్.ఎస్.ఎస్ కోఆర్డినేటర్ బి.జగన్ మోహన్, అధ్యాపకులు లక్ష్మీనారాయణ,సాయి తేజ విద్యార్థినులు పాల్గొన్నారు.

## చిన్నంబావి సంత తై బజార్ వేలానికి దరఖాస్తు ఆహ్వానం

-రూ.5 వేల డిపాజిట్ తప్పనిసరి
-మార్చి 13లోపు గ్రామ పంచాయతీ కార్యాలయంలో చెల్లింపు
-మార్చి 14న తై బజార్ వేలంపాట



చిన్నంబావి,మార్చి 11(ప్రజాజ్యోతి)వనపర్తి జిల్లా చిన్నంబావి మండలంలోని చిన్నంబావి గ్రామ పంచాయతీ 2026--27 ఆర్థిక సంవత్సరానికి సంబందించిన తై బజార్ బహి రంగ వేలంపాట నిర్వహించ నున్నట్లు గ్రామ పంచాయతీ అధికారులు ప్రకటించారు.గ్రామ సర్పంచ్ దివ్యశ్రీ అనుమతుల మేరకు ఈ వేలంపాటను మార్చి 14, 2026న చిన్నంబావి తై బజార్ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. వేలంలో పాల్గొనదలిచిన వారు తప్పనిసరిగా రూ.5 వేల డిపాజిట్ చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.డిపాజిట్ మొత్తాన్ని మార్చి 13లోపు గ్రామ పంచాయతీ కార్యాలయంలో చెల్లించి, పంచాయతీ కార్యదర్శి నుండి అధికారిక రసీదు పొందాలని తెలిపారు. ఆసక్తి గల వ్యక్తులు నిర్ణీత గడువు లోగా దరఖాస్తు చేసుకుని వేలంపాటలో పాల్గొనాలని గ్రామపంచాయతీ అధికారులు కోరారు.

# గాయకుడు మీసాల రామన్న ను ఘనంగా సన్మానించిన జిల్లా ఎస్పీ సునీత రెడ్డి.

## మహిళలకు అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలి.ఎస్పీ సునీత రెడ్డి
## ఎస్పీ సునీత రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసిన మీసాల రామన్న, గంధం నాగరాజ్.



వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్.నేటి సమాజంలో మహిళలను చైతన్య పరుస్తూ, వారికి అవగాహన కల్పించడం కోసం కళాకారుల పాత్ర కూడా ఎంతో అవసరమని, వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి స్పష్టం చేశారు. వనపర్తి జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ని, తెలంగాణ ఉద్యమ గాయకులు మీసాల రామన్న, గంధం నాగరాజ్ లు మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా ఎస్పీ సునీత రెడ్డి మాట్లాడుతూ సమాజంలో మహిళలపై, డ్రగ్స్ పై, ఉన్నత విద్యపై, బాల కార్మికుల నిర్మూలన, చిన్న వయసులో పెళ్లిళ్లు చేసుకోవద్దు అని చెప్తూ ఇలాంటి వాటిపై పాటలు కావాలని అన్నారు. మీసాల రామన్న, గంధం నాగరాజ్ లు పాటలు పాడినందుకు ఎస్పీ సునీత రెడ్డి మీసాల రామన్న ను శాలువాతో ఘనంగా సన్మానించారు. తదనంతరం ఎస్పీ సునీత రెడ్డి స్పందిస్తూ, భవిష్యత్తులో మహిళలపై జరిగే దాడులు, బాలకార్మికుల వ్యవస్థ, డ్రగ్స్, తదితర అంశాల పైన ప్రజలను చైతన్య చేయడానికి, మీ పాటలు ఎంతో అవసరమని పేర్కొన్నారు. కాలేజీ స్కూల్ విద్యార్థులకు అవగాహన కల్పించే విధంగా చైతన్యం చేయాలని, తను కూడా అవగాహన కార్యక్రమంలో పాల్గొంటానని తెలిపారు. జిల్లా ఎస్పీ సునీత రెడ్డి ని మీసాల రామన్న ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో దళిత నాయకులు పెబ్బేటి వెంకటేష్,రాజనగరం రాజేష్, విజయ్ కుమార్,మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# మార్చి 16న ఉపాధి కూలీల సమస్యలపై ఎమ్మార్వో ఆఫీస్ ముందు ధర్నాను జయప్రదం చేయండి.

**సిపిఎం మండల కార్యదర్శి డి బాల్ రెడ్డి.**



వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్. మండల కేంద్రంలోని సిపిఎం పార్టీ గ్రామ కమిటీ ఆధ్వర్యంలో గ్రామాల ఉపాధి హామీ పథకం పనిచేస్తున్న కూలీలను పరిశీలించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం యొక్క విశిష్టత కేంద్ర ప్రభుత్వం కొత్తగా తెచ్చిన వి బి జి రాంజీ పథకం యొక్క నష్టాలు, కష్టాలు ఈ చట్టం వల్ల ఉన్న ఇబ్బందులను గురించి కూలీలకు వివరించారు అదేవిధంగా 2004లో కమ్యూనిస్టుల బలం 64 ఎంపీలు ఉండటం వల్ల యూపీఏ 1 ప్రభుత్వానికి కమ్యూనిస్టుల మద్దతు ఇవ్వడం వల్ల వచ్చిందే 2005 జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టమనీ వివరించారు. దానివల్ల ఉపాధి హామీ పనికి కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు,రాష్ట్ర ప్రభుత్వం 10% నిధులు భరించేవి కానీ 2025 డిసెంబర్ 18న కేంద్ర ఎన్డీఏ ప్రభుత్వం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని రద్దు చేయడం జరిగింది.దాని స్థానంలో వి బి జి రాంజీ చట్టం తెచ్చారు. కానీ నిధులు తగ్గించారు. ఈ చట్టం వల్ల రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు ఖర్చు చేశాక,కేంద్రం 60 శాతం నిధులు కేటాయిస్తామని ఈ చట్టంలో రూపొందించారు. అంటే రాబోయే ఏప్రిల్ ఒకటి నుండి 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం కేటాయిస్తేనే ఉపాధి హామీ పని ఉండే పరిస్థితి ఉంది.లేదంటే ఉపాధి హామీ రద్దయే ప్రమాదం ఉన్నదని వివరించారు. కావున విబి జి రాం జీ పథకాన్ని రద్దు చేయాలని ఎంజిఎన్ఆర్ఈజీఏ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి గ్యారెంటీ చట్టాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.కేంద్ర బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు రోజురోజుకు పెరుగుతున్నాయని,ప్రజా వనరులను ప్రైవేటీకరణ చేయడం ఆపాలని వారు అన్నారు.రైతులకు పండించిన పంటకు కనీస మద్దతు ధరకు చట్టం చేయాలని,దళితులు, గిరిజనులు,మహిళలు, మైనార్టీలపై దాడులు ఆపాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమాలలో సిపిఎం మండల నాయకులు మాజీ ఉప సర్పంచ్ సిహెచ్ వెంకటయ్య,నక్క ఈశ్వర్, వెంకటేశ్వర్ గౌడ్,వెంకన్న గౌడ్,రామకృష్ణ,నవీన్, రాముడు తదితరులు పాల్గొన్నారు.

# విజయవంతమైన మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమం

**- అంతర్జాతీయ అంశాలపై విద్యార్థుల చర్చలు**




**మహబూబ్‌నగర్, మార్చి 11 ( ప్రజా జ్యోతి బ్యూరో )**

విద్యార్థుల్లో అంతర్జాతీయ అవగాహన, నాయకత్వ లక్షణాలు, చర్చా నైపుణ్యాలను పెంపొందించాలనే లక్ష్యంతో జిల్లా విద్యాశాఖ మరియు సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో మోడల్ యునైటెడ్ నేషన్స్ (ఎంయూఎన్) కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది.

ఈ కార్యక్రమంలో జిల్లాలోని 24 పీఎం శ్రీ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు ప్రపంచ దేశాల ప్రతినిధులుగా పాల్గొని వివిధ అంతర్జాతీయ సమస్యలపై చర్చలు జరిపారు. ముఖ్యంగా వాతావరణ మార్పు, పర్యావరణ పరిరక్షణ వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ విద్యార్థులు ప్రపంచ సమస్యలపై అవగాహన పెంపొందించుకోవడం ఎంతో అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా అంతర్జాతీయ రాజనీతిలో ఉపయోగించే చర్చా విధానాలు, నిర్ణయ ప్రక్రియలపై విద్యార్థులు విలువైన అనుభవాన్ని పొందుతారని తెలిపారు.

జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాల్లో ధైర్యంగా పాల్గొనే విద్యార్థులు భవిష్యత్తులో మంచి నాయకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. అకడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలతో పాటు ప్రపంచ సమస్యలపై అవగాహన పెంపొందించుకోవడం అవసరమని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన 11 మంది విద్యార్థులను రాష్ట్రస్థాయిలో నిర్వహించే మోడల్ యునైటెడ్ నేషన్స్ కార్యక్రమానికి ఎంపిక చేసినట్లు జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.ఈ కార్యక్రమంలో జీసీడీఓ అస్రా ఖాద్రి, సాంఘిక శాస్త్ర ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరతంగపాణి రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి విష్ణువర్ధన్ గౌడ్, పాండురంగ, బాలవర్ధన్ రెడ్డి, వెంకటయ్య, జుర్రు నారాయణ, శ్రీలేఖ తదితరులు పాల్గొన్నా

# ఎన్.జి.సి కార్యక్రమంలో సీడ్ బాల్స్,మట్టి కుండల తయారీపై విద్యార్థులకు అవగాహన





**మల్దకల్ మార్చి 11(ప్రజా జ్యోతి):**


పర్యావరణ పరిరక్షణపై విద్యార్థుల్లో చైతన్యం కల్పించేందుకు పి.ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,మల్దకల్ లో నేషనల్ గ్రీన్ కాప్స్ (ఎన్ జి సి) ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా విద్యార్థులు సీడ్ బాల్ తయారీ విధానం పై అవగాహన కల్పించడమైనది మరియు మట్టి కుండల తయారీ కేంద్రాన్ని సందర్శించి వాటి తయారీ ప్రక్రియను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు.ఉపాధ్యాయులు సీడ్ బాల్స్ తయారు చేసే పద్ధతి,వాటి ద్వారా చెట్ల పెంపకం ఎలా సాధ్యమవుతుందో వివరించారు.అలాగే సంప్రదాయ పద్ధతిలో మట్టి కుండలను తయారు చేసే విధానాన్ని చెర్లగార్లపాడులోని కుండల తయారీ కేంద్రాన్ని చూపించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఉపాధ్యాయులు విద్యార్థులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు జి సురేష్,పాఠశాల ఉపాధ్యాయులు నాగేశ్వర రావు,లోకేశ్వరి,ప్రశాంతి,పద్మ,రమణమ్మ,గీత,పాఠశాల ఎకో క్లబ్ సభ్యులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే మెరుగైన విద్యా బోధన

గద్వాల మార్చి 11(ప్రజా జ్యోతి ప్రతినిధి):ప్రభుత్వ విద్యాసంస్థల్లో నిష్ణాతులైన అధ్యాపకులు మెరుగైన విద్యా బోధన చేస్తారని,విద్యార్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు.గద్వాలలోని ప్రభుత్వ ఎంఏఎల్ డీ డిగ్రీ కళాశాలలో ప్రవేశాలు పొందేందుకు విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ముద్రించిన కరపత్రాలను బుధవారం కలెక్టర్ ఛాంబర్ లో కళాశాల అధ్యాపకులతో కలిసి విడుదల చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కళాశాలలో ఆంగ్ల,తెలుగు మాధ్యమంలో అనేక కోర్సులు ఉన్నాయని,ఇక్కడ విద్యను అభ్యసించిన వేలాదిమంది మంచి స్థాయిలో స్థిరపడడం జరిగిందన్నారు.ప్రస్తుతం ఇంటర్మీడియట్ పూర్తి చేసిన విద్యార్థులు దోస్త్ వెబ్ ఆప్షన్ లలో ఈ కళాశాలకు మొదటి ప్రాధాన్యతను ఇచ్చి ఎన్నుకోవాల్సిందిగా ఈ సందర్భంగా కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రధానాచార్యులు షేక్ కలందర్ భాష,అధ్యాపకులు చంద్రమోహన్,సంపత్ కుమార్,కృష్ణమూర్తి,తదితరులు పాల్గొన్నారు.



# విద్యార్థులు యాంటీ డ్రగ్ సోల్జర్స్ గా మారాలి






## -- సెక్టోరియల్ ఆఫీసర్ వెంకటయ్య

నాగర్ కర్నూల్ మార్చ్ 11 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)

డ్రగ్స్ మహమ్మారిని అరికట్టడంలో విద్యార్థులు యాంటీ డ్రగ్ సోల్జర్స్గా కీలక పాత్ర పోషించాలని సెక్టోరియల్ ఆఫీసర్ వెంకటయ్య సూచించారు. బుధవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నాగర్ కర్నూల్ లో జిల్లా విద్యా శాఖ, టీజీ ఈగల్ టీమ్ ఆధ్వర్యం లో ప్రహరీ క్లబ్ సభ్యులైన పాఠశాల విద్యార్థులకు మరియు గైడ్ టీచర్ కు శిక్షణ ఇచ్చారు.

జిల్లాలో గుర్తించిన 20 మండలాలలోని 20 పాఠశాలలకు చెందిన ఇద్దరూ ప్రహరీ క్లబ్ సభ్యులైన ఏడవ తరగతి మరియు తొమ్మిదవ తరగతి విద్యార్థులు, ప్రహరీ క్లబ్ ఇన్చార్జి ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సెక్టోరియల్ ఆఫీసర్ వెంకటయ్య మాట్లాడుతూ ఇక్కడ శిక్షణ పొందిన వారు కాంప్లెక్స్ స్థాయిలో ఇతర విద్యార్థులకు అవగాహన కల్పిస్తారన్నారు. నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ కార్యాలయం నుండి సిఐ శంకర్ నాయక్ గారు ఈ శిక్షణా కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ పాఠశాలల్లో ప్రహరీ క్లబ్ల ఏర్పాటు, డ్రగ్స్ రహిత సమాజంలో విద్యార్థుల బాధ్యత లపై అవగాహన కల్పించాలన్నారు. కార్య క్రమంలో తిరుపతయ్య మరియు లక్ష్మీ ప్రసన్న రిసోర్స్ పర్సన్స్ గా వ్యవహరించారు. పోలీస్ శాఖ నుండి నార్కోటిక్ కానిస్టేబుల్ వీరయ్య, తాడూరు ఎంఈఓ త్యాగరాజు, జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు లత పాల్గొన్నారు.

# నూతన ప్రజాప్రతినిధులకు నేడు ఒక రోజు శిక్షణ

## - జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధులు హాజరు కానున్న కార్యక్రమం



మహబూబ్నగర్, మార్చి 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గురువారం (మార్చి 12) ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమీపంలోని అనంత మారుతి గార్డెన్ ఫంక్షన్ హాల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ శిక్షణ శిబిరం జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఇన్చార్జి మంత్రి, జిల్లా మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, మేయర్, డిప్యూటీ మేయర్, మున్సిపల్ చైర్మన్లు హాజరు కానున్నట్లు వెల్లడించారు. బుధవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో సమావేశమై శిక్షణ కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం అనంత మారుతి గార్డెన్ ఫంక్షన్ హాల్ను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మార్చి 6 నుంచి జూన్ 12 వరకు పది థీమ్లపై చేపట్టనున్న కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచ్లు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లకు సంబంధిత జిల్లా అధికారులు పవర్పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. అలాగే రిసోర్స్ పర్సన్లు గ్రామపంచాయతీ, మున్సిపల్ చట్టాలపై అవగాహన కల్పించనున్నట్లు చెప్పారు. శిక్షణ కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లను పక్కాగా చేయాలని అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వేదిక, షామియానా, సీటింగ్ సదుపాయం, పార్కింగ్ స్థలం, తాగునీటి సౌకర్యం వంటి అంశాలను పరిశీలించి సూచనలు చేశారు. పోలీస్ బందోబస్తు విషయంలో కూడా పోలీస్ అధికారులతో సమీక్షించి తగిన సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఇన్చార్జి డిపిఓ, జడ్పీ సీఈఓ వెంకట రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన--ప్రగతి ప్రణాళికలో భాగంగా పరిశుభ్రత తనిఖీలు

## - జనరల్ ఆసుపత్రి, నగరంలోని పలు డివిజన్లలో కార్యక్రమాలు

మహబూబ్నగర్, మార్చి 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా బుధవారం మహబూబ్నగర్ జిల్లా కేంద్రంలో పలు పరిశుభ్రత కార్యక్రమాలు నిర్వహించారు. ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో పారిశుధ్య సేవలను స్థానిక సంస్థల ఇన్చార్జి అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ నగర పాలక సంస్థ కమిషనర్ రామానుజుల రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని పబ్లిక్ టాయిలెట్లను సందర్శించి వాటి నిర్వహణపై సిబ్బందికి సూచనలు చేశారు.

అనంతరం నగరంలోని 20, 21 డివిజన్లలో నిర్వహించిన పరిశుభ్రత కార్యక్రమాల్లో నగర పాలక సంస్థ మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ పాల్గొన్నారు. అలాగే 11వ డివిజన్లోని సరస్వతి శిశు మందిర్ పాఠశాలలో నిర్వహించిన "ట్రీస్ ఫర్ ఉమెన్ -- అమృత్ మిత్ర" కార్యక్రమంలో భాగంగా మేయర్ జి. మమత, డిప్యూటీ మేయర్ సురేందర్ రెడ్డి, కమిషనర్ రామానుజుల రెడ్డి మొక్కలు నాటారు. తర్వాత కమిషనర్ రామానుజుల రెడ్డి ఫుడ్ సేఫ్టీ అధికారులతో కలిసి నగరంలోని హోటళ్లు, రెస్టారెంట్లను తనిఖీ చేశారు. హోటళ్లలోని కిచెన్లు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు, కళాశాల విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది, ఎన్సీసీ విద్యార్థులు, సీనియర్ సిటిజన్లు మరియు ప్రజలు పాల్గొన్నారు.




# నూతన జిల్లా కలెక్టర్ ని మర్యాద పూర్వకంగా కలిసిన మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్





**అలంపూర్ డివిజన్ (ప్రజాజ్యోతి) మార్చి11:**
జోగులాంబ గద్వాల జిల్లా కలెక్టర్ గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ బుధవారం అలంపూర్ మాజీ ఎమ్మెల్యే ఏఐసిసి కార్యదర్శి డాక్టర్ ఎస్ ఏ. సంపత్ కుమార్ తో పాటు కాంగ్రెస్ నాయకులు అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప వైస్ చైర్మన్ కుమార్,ఐజ మున్సిపాలిటీ కౌన్సిలర్లు,శిక్షావల్లి ఆచారీ,ఫర్వీన్ తబస్సుమ్ మహబూబ్ పాషా, సంతోషమ్మ మైనర్ బాబు,జెమిని మద్దిలేటి, యుగంధర్,రాధా చిన్నికృష్ణ,సులోచనమ్మ, సర్పంచులు,రాజ్ కుమార్ మధు నాయుడు జిల్లా మైనార్టీ సెల్ నాయకులు ఇసాక్, జిల్లా ఓబీసీ సెల్ నాయకులు నల్లారెడ్డి,మాజీ జడ్పిటిసి మద్దిలేటి మాజీ సింగిల్ విండో చైర్మన్ సంకపురం రాముడు,జిల్లా మహిళా అధ్యక్షురాలు నాగశిరోమణి మండల అధ్యక్షులు ఉండవల్లి గోపాల్ కలవడం జరిగింది.

# మల్దకల్ మండలంలో ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు-98 పశువులకు టీకాలు

మల్దకల్ మార్చి 11(ప్రజా జ్యోతి):జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలంలో పశువులలో గాలికుంటు (ఎఫ్ ఎం డి) వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం 10-03-2026 నుండి 09-04-2026 వరకు నిర్వహిస్తున్నారు.ఇందులో భాగంగా బుధవారం (11-03-2026) పాల్వాయి,కుర్తిరావులచెర్వు గ్రామాల్లో ఉచిత టీకాల కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పాల్వాయి పశువైద్య అధికారి డా.ఉష మాట్లాడుతూ,గాలికుంటు వ్యాధి సోకిన పశువులకు నోరు,గిట్టలలో పుండ్లు రావడం, నోటి నుండి చొంగ కారడం,జ్వరం రావడం,మేత తినకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయని తెలిపారు.ఈ వ్యాధి వల్ల పాల దిగుబడి తగ్గిపోవడంతో పాటు ఎద్దులు వ్యవసాయ పనులు చేయలేకపోతాయని చెప్పారు.కాబట్టి వ్యాధి రాకుండా ముందుగానే టీకాలు వేయించుకోవాలని రైతులకు సూచించారు.పాల్వాయి గ్రామంలో సర్పంచ్ సుజాత ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 60 ఆవులు, 38 గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు.ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ ఉచిత టీకాల కార్యక్రమాన్ని పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజాప్రతినిధులు, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.



# పాలమూరు బిడ్డలు కోహినూర్ వజ్రాలు

## – విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే పిలుపు




మహబూబ్‌నగర్, మార్చి 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్‌లో పుట్టిన ప్రతి బిడ్డ అసాధారణమైన వారేనని, పాలమూరు బిడ్డలు లేబర్ కాదని కోహినూర్ వజ్రాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

మహబూబ్‌నగర్ ఫస్ట్ మరియు వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని వైటీసీ బిల్డింగ్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో పదవ తరగతి చదువుతున్న 150 మంది విద్యార్థులకు ఐఐఐటీ లక్ష్యంగా గత 45 రోజులుగా నిర్వహించిన ప్రత్యేక శిక్షణ శిబిరం ముగింపు సమావేశం బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ పాలమూరు జిల్లా కేవలం శ్రామిక జిల్లా కాదని, ఎన్నో అన్యాయాలు ఎదుర్కొన్న ప్రాంతమని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పాలమూరు చరిత్ర కీలక పాత్ర పోషించిందని, అయినప్పటికీ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా జిల్లాకు పూర్తి న్యాయం జరగలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. యువత తెలంగాణ చరిత్రను కొత్తగా రాసి భవిష్యత్తుకు బాటలు వేయాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు స్పష్టమైన లక్ష్యంతో కష్టపడితే తెలంగాణలో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగవచ్చని తెలిపారు.మన ప్రాంతం ఎన్నో దశాబ్దాలుగా కరువు, కష్టాలను ఎదుర్కొన్నప్పటికీ ప్రజల్లో ఉన్న మేధస్సు, కష్టపడే మనస్తత్వం గొప్ప సంపదగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ శిబిరంలో పాల్గొన్న విద్యార్థులు మంచి ఫలితాలు సాధించి తల్లిదండ్రులకు గౌరవం తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులు తమ కుటుంబ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని కష్టపడి చదవాలని సూచించారు.కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ దరావత్ జానకి మాట్లాడుతూ జీవితంలో విద్య, వైద్యం లభిస్తే జీవితం సాఫీగా ముందుకు సాగుతుందని అన్నారు. లక్ష్య సాధనలో ఆడ, మగ అనే తేడా ఉండదని, తాను కూడా ప్రభుత్వ పాఠశాలలో చదివి ఎస్పీగా ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ పొందిన విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించి ఐఐఐటీలో సీట్లు పొందాలని ఆకాంక్షించారు.నగర మేయర్ గుమ్మాల మమత మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌ను విద్యా కేంద్రంగా అభివృద్ధి చేయడంలో ఎమ్మెల్యే కృషి చేస్తున్నారని అన్నారు. డిప్యూటీ మేయర్ సురేందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే ఫాలోవర్స్ ను తయారు చేయడం లేదని, లీడర్లను తయారు చేస్తున్నారని ఆయన అన్నారు.

వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ మాట్లాడుతూ ఇలాంటి నాయకత్వం అరుదుగా లభిస్తుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్ గుముడాల రాధ , జిల్లా విద్యాధికారి ప్రవీణ్ కుమార్, ఐఐఐటీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రావణ్ కుమార్, అకడమిక్ మానిటరింగ్ అధికారి దుంకుడు శ్రీనివాస్, మహబూబ్‌నగర్ ఫస్ట్ పర్యవేక్షకుడు గుండా మనోహర్, వందేమాతరం ఫౌండేషన్ కోఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, సోంబూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలి

## – మున్సిపల్ కాంట్రాక్టర్ల సన్మాన కార్యక్రమంలో ఎమ్మెల్యే పిలుపు



మహబూబ్‌నగర్, మార్చి 11 ( ప్రజా జ్యోతి బ్యూరో ) మహబూబ్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని కమర్షియల్ దుకాణ యజమానులు, గృహ యజమానులు తమ ఆస్తి పన్నులను సమయానికి చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ కాంట్రాక్టర్లు నూతనంగా ఎన్నికైన నగర మేయర్, డిప్యూటీ మేయర్ మరియు కార్పొరేటర్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ నగరంలో గత రెండు సంవత్సరాలుగా పలు అభివృద్ధి కార్యక్రమాలు పూర్తయ్యాయని తెలిపారు. ప్రతి డివిజన్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు మల్టీపర్పస్ షెడ్లు, మహిళా సంఘాల భవనాలు నిర్మించామని పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ కార్పొరేషన్‌గా రూపాంతరం చెందిన నేపథ్యంలో భారీ ఎత్తున నిధులు రానున్నాయని, ఆ నిధులను సమర్థంగా వినియోగించేందుకు మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్ మరియు కార్పొరేటర్లు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వ ఉద్యోగుల జీతాలతో పాటు ప్రతి నెలా సుమారు రూ. 1.40 కోట్ల వరకు ఇతర సిబ్బంది జీతాలు చెల్లిస్తున్నామని తెలిపారు. రెవెన్యూ ట్యాక్స్ కలెక్షన్ కార్పొరేషన్‌కు ప్రధాన ఆదాయ వనరుగా ఉండటంతో బకాయిలు ఉన్న చోట కఠినంగా వసూలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. నగరంలో ట్యాక్స్ కలెక్షన్లు పెంచినందుకు కమిషనర్‌ను అభినందించారు. కాంట్రాక్టర్లకు పెండింగ్‌లో ఉన్న బిల్లులను వీలైనంత వరకు రంజాన్ పండుగకు ముందు కొంతమేర విడుదల చేసి, మిగిలిన బిల్లులను శ్రీరామ నవమి వరకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్ల సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించిన మున్సిపల్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్‌కు ఆయన అభినందనలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మేయర్ గుమాల మమత, డిప్యూటీ మేయర్ సురేందర్, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, కార్పొరేటర్లు, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామాంజనేయులు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం తరపున ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా

నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 11 (ప్రజా జ్యోతి) నారాయణపేట నియోజకవర్గం లో రంజాన్ పండుగ సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లిం సోదరులకు రాష్ట్ర ప్రభుత్వం తోఫా విడుదల చేసిందని ముస్లిం మైనార్టీ సోదరులకు ఎమ్మెల్యే కార్యాలయంలో తెలియజేశారు నారాయణపేట డిప్యూటీ తహసిల్దార్ రామకృష్ణ, ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మండలాల చొప్పున 4 లక్షల రూపాయలు, అలాగే తోఫా వెయ్యి జతల విడుదల చేయడం జరిగిందని అన్నారు, ప్రభుత్వం పంపించిన తోప ప్రతి ఒక్క నిరుపేదలకు అందేటట్టు చూడాలని ముస్లిం మైనార్టీ సోదరులకు , ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తుందని ముస్లిం సోదరులకు అందేటట్టు చూస్తుందని అన్నారు, కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, కౌన్సిలర్లు , మహమ్మద్ తాకి చాంద్, తాకి చాంద్ పీర్, మల్లేష్, రవి,రాజేష్ ఘాట్, మాజీ కౌన్సిలర్ సలీం, = ×.మధుసూదన్, ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు (గ్రా ) చిట్టెం మాధవరెడ్డి,ముస్లింమైనార్టీ వివిధ మండలాల అధ్యక్షులు,మత పెద్దలు, ముస్లిం మైనార్టీ నాయకులు పాల్గొన్నారు



## మున్సిపల్ సమావేశంలో వార్డు సమస్యలపై చర్చ



**గద్వాల మార్చి 11(ప్రజా జ్యోతి ప్రతినిధి)**
:బుధవారం జరిగిన మున్సిపల్ కౌన్సిల్ తొలి సమావేశంలో పట్టణంలోని వార్డుల సమస్యలపై కౌన్సిలర్లు చర్చించారు.సమావేశంలో వార్డు కౌన్సిలర్ పులిపాటి వెంకటేష్ మాట్లాడుతూ,ఎండాకాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో పట్టణంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని తెలిపారు.కొన్ని ప్రాంతాల్లో బోర్లు,నీటి ట్యాంకులు సరిగా పనిచేయకపోవడంతో ప్రజలకు తాగునీరు అందడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.వాటర్ సరఫరా సమయానికి ఇవ్వాలని,పనిచేయని బోర్లను వెంటనే మరమ్మతులు చేయాలని అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.అలాగే డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడం,ప్రధాన సీసీ రోడ్డుపై ఉన్న కల్వర్ట్ దెబ్బతినడం వంటి సమస్యలను కూడా సమావేశంలో ప్రస్తావించారు. ముఖ్యంగా 37వ,వార్డులో నీటి కొరత,శానిటేషన్ సమస్యలు,వీధి దీపాల లోపం వంటి అంశాలను వివరించారు.భగీరథ నీటిని గతంలో ట్యాంకులకు పూర్తిగా వదిలేవారని, ప్రస్తుతం సగం ట్యాంకు వరకు మాత్రమే వదులుతున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.అలాగే బోర్ల మరమ్మతులు,కొత్త డ్రైనేజీ కాలువల నిర్మాణం,సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టాలని సూచించారు.కాలువలు శుభ్రం చేసే సిబ్బంది తక్కువగా ఉండడంతో డ్రైనేజీ సమస్యలు పెరుగుతున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్,వైస్ చైర్మన్,కమిషనర్ సమస్యలను పరిశీలించి త్వరలోనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కౌన్సిలర్లకు హామీ ఇచ్చారు. సమావేశంలో పలువురు కౌన్సిలర్లు తమ వార్డుల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.

## గ్రామంలోని పాఠశాలకు టీవీ అందజేత



**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 11( ప్రజా జ్యోతి)**
దామరగిద్ద మండలం ఖూా అన్నసాగర్ పాఠశాలకు స్థానిక అన్నసాగర్ నివాసి ఆంజనేయులు వారి , మొగులమ్మ జ్ఞాపకం గా ాచీ×ణూ ుఎ 42 ఊఅఎష్ట్రవం అందచేశారు. గ్రామ సర్పంచ్ అనంతమ్మ గారు,మండల విద్యాధికారి కృష్ణ రెడ్డి గారి చేతుల మీదుగా ుఎ అందజేయడం జరిగింది.కార్యక్రమంలో హేడ్మా ష్టర్ హుసేనప్ప గారు, అంగన్వాడీ టీచర్, ఉపాధ్యాయులు జూ. ప్రవీణ్ కుమార్, తిరుపతి రెడ్డి, శారద, ఆలీ,జఫ్రా మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

## శాసనపల్లి గ్రామంలో ఎద్దడి తీర్చిన రవికుమార్ గౌడ్

**నారాయణపేట నియోజకవర్గం ప్రతినిధి మార్చ్ 11 (ప్రజా జ్యోతి)**



నారాయణపేట మండలం శాసనపల్లి గ్రామంలో నీటి ఎద్దడి ఉండడంతో గ్రామస్తులు అందరు కలిసి రవికుమార్ గౌడ్ ని తమ సమస్యను వివరించారు, వెంటనే స్పందించిన రవికుమార్ గౌడ్ శాసనపల్లి గ్రామస్తుల కోరిక మేరకు గ్రామంలోని మైసమ్మ గుడి దగ్గర బోరు వేయించి గ్రామస్తుల నీటి అవసరాలను తీర్చిన రవికుమార్ గౌడ్ ని గ్రామ సర్పంచు మరియు గ్రామ పెద్దలు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలుపుకున్నారు అనంతరం శాసనపల్లి గ్రామంలో జరుగుతున్న జాతర సందర్భంగా అక్కడ ఉన్న పేదవారికి బట్టలు వితరణ చేసిన రవికుమార్ గౌడ్, ఇలాంటి నాయకుడు యువకులు ప్రజాసేవలో ఉండాలని ప్రజలు కోరుతున్నారు